క్లుప్తంగా

నేటి నుంచి కాట్రగుంటలో గడప గడపకు మన ప్రభుత్వం



మాట్లాడుతున్న ఎంపీడీఓ రావూరి జనార్దన్

కొనకనమిట్ల: మండలంలోని కాట్రగుంట పంచాయతీలో బుధవారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రావూరి జనార్దన్ తెలిపారు. మంగళవారం కాట్రగుంట గ్రామ సచివాలయంలో ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డితోపాటు మండల స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. బుధవారం కాట్రగుంట, ఎస్సీ, బీసీ కాలనీలలో, గురువారం తన్నీరువారిపల్లి, ఓబులరెడ్డిపల్లి, ఎస్సీ కాలనీ, కొమ్మొళ్లపల్లిలో, శుక్రవారం పేరారెడ్డిపల్లి, నర్సాయపల్లి, వెంగళపల్లి గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం

ముండ్లమూరు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఏపీఓ కొండయ్య తెలిపారు. ముండ్లమూరులో ఉపాధి కూలీలతో మంగళవారం రోజ్ గార్ దివాస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన రోజు వారి వేతనం 272 రూపాయలు అందాలంటే మార్కింగ్ ఇచ్చిన కొలతల ప్రకారం పనులు జరగాలన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి పది గంటల వరకు పనులు చేయాలన్నారు. పని చేసిన ప్రకారం వేతనం అందుతుందని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. నీటి నిల్వ, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. సీఎల్ఆర్సీ కోర్స్ డైరెక్టర్ హరికృష్ణ, సిబ్బంది అశోక్, క్షేత్ర సహాయకురాలు గోపనబోయిన పార్వతి, కూలీలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

దర్శి: పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు కోరారు. 6 నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కుసుమకుమారికి వినతి పత్రం అందజేశారు. రంగారావు మాట్లాడుతూ కార్మికులు నిత్యావసరాలకు అప్పులు చేసి బతకాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఆర్జేడీ



రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ

గిద్దలూరు రూరల్: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను మంగళవారం ఆర్జేడీ సుబ్బారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల సంఖ్య, వసతులపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పనిచేయాలన్నారు. మధ్యాహ్న భోజనం, పాఠశాలలోని మరుగుదొడ్ల నిర్వహణపై సిబ్బందిని ప్రశ్నించారు. మార్కాపురం ఉపవిద్యాశాఖాధికారి చంద్రమౌళీశ్వర్ ఉన్నారు.

ఆటో డ్రైవర్ కుటుంబానికి రూ.1.15 లక్షల సాయం



మృతుడి భార్యకు చెక్కు అందిస్తున్న యూనియన్ నాయకులు

మార్కాపురం: గుండె పోటుతో మరణించిన ఆటో డ్రైవర్ కుటుంబానికి ట్యాక్సీ యూనియన్ ఆధ్వర్యంలో రూ.1.15 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. మండలంలోని యాచవరం గ్రామానికి చెందిన తన్నీరు శ్రీను ఈ ఏడాది మార్చి 23న గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని ఆదుకునేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశామని యూనియన్ అధ్యక్షుడు సి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామకృష్ణారెడ్డి, రామారావు, కృష్ణా, తులసికార్తీక్, హేమంత్ కుమార్, వెంకటనారాయణ, అమిరులాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరూరా 'జగనన్నే మా భవిష్యత్'



కుంచేపల్లిలో సీఎం జగన్ సందేశాన్ని వింటున్న ఉపాధి హామీ కూలీలు

పొదిలి రూరల్: మండలంలోని మాదాలవారిపాలెం ,ఆముదాలపల్లి, పాములపాడు, కుంచేపల్లి, గొలపల్లిలో మంగళవారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదాలవారిపాలెంలో మర్రిపూడి ఎంపిపి వాకా వెంకటరెడ్డి, పాములపాడు మండల సచివాలయాల కన్వీనరు పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి, ఆముదాలపల్లిలో సర్పంచ్ శిరిమల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మధ్య తేడాను ప్రజలకు వివరించారు. ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని పుస్తకంలో నమోదు చేశారు. ఇంటి యజమాని సెల్‌ఫోన్‌తో 82960 82960 నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి, వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. అందరి క్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గుంటూరి పిచ్చిరెడ్డి, ఆనికాళ్ల ఈశ్వర్‌రెడ్డి, నారాయణరెడ్డి, నాయకులు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

■ **కొనకనమిట్ల:** 'మా నమ్మకం నువ్వే జగనన్న' కార్యక్రమం మండలంలోని అన్ని గ్రామాల్లో ఉత్సాహంగా సాగుతోంది. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి పర్యవేక్షణలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ పాలనపై గ్రామాల్లో ప్రజలు చూపిస్తున్న ఆదరణ పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్నిస్తోందని నాయకులు పేర్కొన్నారు. మంగళవారం గొట్లగట్టు, పాతపాడు, చినారికట్ల, సిద్ధవరం, సలనూతల, మునగపాడు గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఉడుముల రామనారాయణరెడ్డి, సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాదాలవారిపాలెంలో స్టిక్కర్లు పంపిణీ చేస్తున్న నాయకులు



గొట్లగట్టులో స్టిక్కర్లు అందిస్తున్న నాయకులు

విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు



నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

బేస్తవారిపేట: ప్రభుత్వం విద్యా వ్యవస్థలో అనేక విప్లవాత్మక మార్పులు చేపట్టిందని ఎంఈఓ జింకా వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండలంలోని సలకలవీడు ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. నాడు-నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించడం, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, బూట్లు, యూనిఫామ్స్ అందిస్తున్నామని వివరించారు. పిల్లలను బడికి పంపే తల్లికి అమ్మఒడి పథకంలో ఏడాదికి రూ.15 వేలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థుల కోసం ఇంగ్లిష్ మీడియం విద్య ప్రవేశ పెట్టారని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపాలని కోరారు. హెచ్ఎం మధుసూదన్‌రెడ్డి, యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నాయకులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

దొనకొండ: మండలంలోని పోలేపల్లి, దేశిరెడ్డిపల్లి గ్రామాల్లో జరుగుతున్న నాడు-నేడు కింద మంజూరైను అదనపు తరగతి గదుల పనులను మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు మంగళవారం పరిశీలించారు. తరగతి గదులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన నిర్మించాలన్నారు. సమస్యలు ఉంటే తమకు తెలియజేయాలన్నారు. అనంతరం పోలేపల్లి ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. దేశిరెడ్డిపల్లిలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలన్నారు. కుకింగ్ నిర్వాహకులకు సూచనలు, సలహాలిచ్చారు. తరగతిలో విద్యార్థులతో మాట్లాడి సమాధానం రాబట్టారు. ఆయన వెంట సీఆర్పీలు ఉన్నారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి

కురిచేడు: నాడు-నేడుతో విద్యాలయాల అభివృద్ధి జరిగిందని మండల విద్యాశాఖాధికారి వస్త్రాంనాయక్ అన్నారు. మండలంలోని పడమర వీరాయపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవానికి ఆయన ఎంపీడీఓ వసంతరావు నాయక్‌తో కలిసి హాజరయ్యారు. చదువుతో పాటు ఆటలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు ఆకర్షించవచ్చన్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలు జరపటం అభినందనీయమని ఎంపీడీఓ వసంతరావు నాయక్ అన్నారు. సమాజంలో చదువు ద్వారా మూఢ నమ్మకాలను తొలగించాలని వైద్యాధికారి ప్రవీణ్ కోరారు. సంఘసేవే సర్వేశ్వరుని సేవని ప్రధానోపాధ్యాయుడు పూర్ణచంద్రరావు అన్నారు. విద్యార్థులు నృత్యాలతో అలరించారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ మేకల లక్ష్మీకుమారి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, విజయమేరి, షేక్ ఖాదర్‌వలి, సూర్యనారాయణ, ఎన్.సంధ్యారాణి, రామసుబ్బారావు, ఆదెమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

23 నుంచి ఆది శంకరాచార్య జయంత్యుత్సవాలు



ఎమ్మెల్యే కేపీకి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ ప్రతినిధులు

మార్కాపురం: ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మార్కాపురం పట్టణంలోని శివాలయంలో జగద్గురు ఆది శంకరాచార్య జయంత్యుత్సవాలకు హాజరుకావాలని మంగళవారం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందజేశారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తునట్లు తెలిపారు. 25న బ్రాహ్మణ సమారాధన నిర్వహిస్తామని, అదే రోజు స్వామి వారి నగరోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ బాలమురళీకృష్ణ, గోపాలుని హరిహరరావు, అనఘ సుబ్బారావు, శేషసాయి, ఎస్.హరి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్‌పై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

తాళ్లూరు: బెల్లంకొండవారిపాలెం పంచాయతీ పరిధిలో మంగళవారం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించారు. కళాజాత ఆధ్వర్యంలో కళాజాత స్వచ్ఛత ప్రాముఖ్యాన్ని, గ్రామాల్లో పరిశుభ్రత పాటిస్తే రోగాలకు దూరంగా ఉండే అవకాశాలను కళాజాత బృందం ఆలపించింది. సర్పంచ్ పీఎస్ శ్రీకాంత్‌రెడ్డి, కార్యదర్శి శ్రీవల్లి పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు



చిన్నారికి మజ్జిగ తాగిస్తున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

కొమరోలు: జగనన్న పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. కొమరోలు పట్టణం పురుషోత్తంపల్లి, తాతిరెడ్డిపల్లె గ్రామాల్లో ఆయన మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరిస్తూ సమస్యలపై ఆరా తీస్తూ ముందుకు సాగారు. ప్రజాసమస్యలు విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పిలిపించి వెంటనే సమస్యలు పరిష్కారం కావాలంటూ ఆదేశించారు. అనంతరం మూడేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించారు. ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఏ మేరకు చేరుతున్నాయో తెలుసుకునేందుకు నేరుగా ప్రజాప్రతినిధులు, అధికారులు ఇళ్ల వద్దకు వస్తున్నారని చెప్పారు. ప్రజాపాలనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కార్యక్రమమే గడప గడపకు మన ప్రభుత్వమని తెలిపారు. జగనన్న ప్రవేశ పెట్టిన అనేక రకాల సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరూ లబ్ధి పొందారని, ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి అద్భుత స్పందన లభిస్తోందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను 98 శాతం వరకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని, రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీకి మద్దతు తెలిపి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నన్ను ఎమ్మెల్యేగా ప్రజలందరూ గెలిపించి ఆశీర్వదించాలని అన్నా రాంబాబు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు సారె వెంకట నాయుడు, సర్పంచ్‌లు దండు శశికళ, హటేల్ పీరా, ప్రదీప్, వైస్ ఎంపీపీ షేక్ మౌలాలీ, ఎంపీటీసీలు షేక్ సుభానీ, తిరుమలరాజు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు బోయిళ్ల జనార్దన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్‌నాయుడు, వెంగయ్యచౌదరి, వెంకట సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, తిరుమలనాథ్ పాల్గొన్నారు.

ఆర్థిక కారణాలతో మహిళ ఆత్మహత్య

మార్కాపురం టౌన్: ఆర్థిక కారణాలతో మండలంలోని కొండేపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ పురుగు మందు తాగి ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. రూరల్ ఎస్సై సుమన్ కథనం మేరకు గ్రామానికి చెందిన మూల కృష్ణారెడ్డి భార్య ఆదినారాయణమ్మ(37) ఆర్థిక కారణాలతో ఈ నెల 16న పురుగు మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి ఒంగోలులోని ఒక ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మరణించింది. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై తెలిపారు.

రైలు కింద పడి యువకుడి మృతి



రైలు పట్టాల మధ్య యువకుడి మృతదేహం

మార్కాపురం: మార్కాపురం నుంచి గజ్జలకొండ వెళ్లే దారిలో ఫ్లయ్‌ఓవర్ బ్రిడ్జి నుంచి సుమారు కిలో మీటరు దూరంలో రైలు పట్టాల మధ్య సుమారు 25 ఏళ్ల యువకుడి మృతదేహాన్ని రైల్వే పోలీసులు కనుగొన్నట్లు ఏఎస్సై వెంకట్రావు తెలిపారు. ట్రెయిన్‌లో వెళ్తూ నిద్రమత్తులో కింద పడి మృతి చెంది ఉండవచ్చని చెప్పారు. మృతుడి శరీరంపై ఆకుపచ్చ రంగు ప్యాంట్, టీషర్ట్ ఉన్నాయి. వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఏఎస్సై సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

గిద్దలూరు రూరల్: అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి ఆంజనేయులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా పట్టణంలోని భారత్ పెట్రోల్ బంకు ఆవరణలో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి కాలంలో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలున్నాయని, వాటి నుంచి ప్రజలు ఏ విధంగా రక్షించుకోవాలనే వాటిపై సూచనలు చేశారు. పెట్రోల బంకు పరిసరల్లో ధూమపానాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు.

విద్యార్థులకు కళ్లజోళ్ల పంపిణీ

కురిచేడు: విద్యార్థులకు దృష్టిలోపం నివారణకు జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా నేత్ర పరీక్షలు చేసి కళ్లజోళ్ల పంపిణీ చేస్తోంది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పొట్లపాడు, దేకనకొండ, బోధనంపాడు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లోని 83 మంది విద్యార్థులకు కళ్లజోళ్లు ఆప్తాల్మిక్ అధికారి బీజేఎస్ హెరాల్డ్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.



కళ్లజోళ్లతో విద్యార్థులు

వేసవిలో పాడి పశువులను సంరక్షించుకోవాలి

● పశుసంవర్థక శాఖ జేడీ బేబిరాణి



దాణా అందిస్తున్న జేడీ బేబిరాణి

తాళ్లూరు: పశుసంవర్థక శాఖ అందిస్తున్న ప్రోత్సాహకాలను పశుపోషకులు ఉపయోగించుకోవాలని జిల్లా పశుసంవర్థక శాఖ జేడీ బేబిరాణి అన్నారు. దారంవారిపాలెంలో మంగళవారం ఉచిత పశువైద్యశిబిరం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. బేబిరాణి మాట్లాడుతూ వేసవిలో పశువులను రక్షించుకోవాలని, పశుపోషణకు పాటించాల్సిన మేళకువలు వివరించారు. సబ్సిడీపై దాణామృతం, చాఫ్ కట్టర్, గడ్డి జొన్నల పథకం వినియోగించుకోవాలని కోరారు. సర్పంచి మంచాల వెంకటేశ్వరరెడ్డి, దర్శి సహాయ సంచాలకులు డాక్టర్ పురుషోత్తంరాజు, తాళ్లూరు, తూర్పుగంగవరం పశువైద్యాధికారులు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ రాంబాబు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ దారం రమణారెడ్డి పాల్గొన్నారు.

ముస్లింలకు ఆత్మీయ విందు



ముస్లింలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: రంజాన్ పండగ దానధర్మాలకు ప్రతీక ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రాత్రి ఏ1 గ్లోబల్ ఇంజినీరింగ్ కళాశాలలో చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపవాస దీక్షలు చేసిన వారికి ఇఫ్తార్‌తోపాటు మౌల్వీలు, ఇమామ్‌లకు షంషేర్ అలీబేగ్ ఆధ్వర్యంలో వస్త్ర దానం చేశారు. కార్యక్రమంలో మార్కాపురం పట్టణ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు కొనకనమిట్ల తర్లుపాడు, పొదిలి మండలాలకు చెందిన ప్రజా ప్రతినిధులతో పాటు బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్‌పీ యాదవ్, డాక్టర్ మగ్బూల్ బాషా, ఉస్మాన్ బేగ్, జాఫర్ బేగ్, జిలానీ, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం



మున్సిపల్ చైర్మన్ కృష్ణను సన్మానిస్తున్న మెప్మా సిబ్బంది

మార్కాపురం టౌన్: పట్టణంలోని మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ దొడ్డా భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మెన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పొదుపు గ్రూపుల్లో రుణాలు తీసుకుని జీవనోపాధి కోసం వ్యాపారాలు చేస్తూ ఆ ఉత్పత్తులను విక్రయించేందుకు మార్కెట్‌ను ప్రారంభించడం అభినందనీయమన్నారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ప్రోత్సాహంతో ఈ మార్కెట్‌ను ఏర్పాటు చేశామని ప్రతి 3 నెలలకు వరుసగా రెండు రోజులు ఉత్పత్తులు అమ్ముతామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిరాజ్, మెప్మా మేనేజర్ ఎలీషా బాబు, కార్యదర్శి కాలువ దుర్గ, మెప్మా సిబ్బంది కుమార్, శ్రీలత, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులను సన్మానించారు.

నవధాన్యాల సాగు భూమికి రక్షణ



ర్యాలీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ముండ్లమూరు: పొలంలో నవ ధాన్యాల సాగుతో భూమికి రక్షణ ఉంటుందని ప్రకృతి వ్యవసాయం ఎంటీ ప్రభాకర్ తెలిపారు. మండల కేంద్రం ముండ్లమూరులో మంగళవారం ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో 365 రోజులు పంట పచ్చగా ఉండేందుకు నవ ధాన్యాల సాగు దోహదపడుతుందన్నారు. రైతులు తమ పొలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ సాగు చేసుకోవాలన్నారు. భూమి నేల కోతకు గురికాకుండా చూసుకునేందుకు పలు సలహాలు, సూచనలు చేశారు. పీఎండీఎస్ పద్ధతుల ద్వారా భూమిలోని కర్బణం గాలిలోకి వెళ్లకుండా భూమిని రక్షించేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ చేశారు. ఎల్-2 మురళి, ఐసీఆర్పీలు పేరయ్యచౌదరి, ఝాన్సీ, కోటిరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మాట్లాడుతున్న బెన్ని లింగం

మార్కాపురం: పాస్టర్లకు ఇచ్చిన హామీని నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నామని పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లాజరస్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశానికి అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జాన్ బెన్ని లింగం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా పాస్టర్లకు గౌరవ వేతనం ఇచ్చారన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే విషయమై ప్రభుత్వ ముఖ్య సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని సంప్రదించగా మూడో ఫేజ్‌లో అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ ఏలియా, జగన్‌పాల్, ఐజయ్య, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా తిరుగుతున్న లారీ సీజ్

● రూ.3 లక్షల జరిమానా



లారీని సీజ్ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

కురిచేడు: ప్రభుత్వానికి రోడ్ ట్యాక్స్ చెల్లించకుండా అక్రమంగా తిరుగుతున్న లారీని గుర్తించి పట్టుకుని దానికి 3.20 లక్షల రూపాయల జరిమానా విధించినట్లు దర్శి మోటారు వాహనాల అధికారి పి. రవికుమార్ తెలిపారు. దర్శి రోడ్డులోని పెట్రోలు బంకు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీని గుర్తించామన్నారు. దాని రికార్డులు పరిశీలించగా 2020 నుంచి రోడ్ ట్యాక్సు చెల్లించలేదని తెలిపారు. వాహనదారులు సకాలంలో రోడ్ ట్యాక్సులు చెల్లించి రికార్డులు వాహనాల్లో ఉంచుకోవాలని రవికుమార్ కోరారు.